www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
అనంతపురము జిల్లా /శ్రీ సత్యసాయి జిల్లా

# చదివిన బడికి రూ.14 లక్షల కానుక


## పూర్వ విద్యార్థుల సేవాస్ఫూర్తి.. జెడ్పీ పాఠశాలకు రూ.14 లక్షల భోజనశాల



**వజ్రకరూరు,జూలై25.అక్షరటైమ్స్:-** వజ్రకరూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు అందించిన అపూర్వ కానుక అందరినీ ఆకట్టుకుంది. ఎస్ఎల్‌సీ 1956--68 బ్యాచ్ పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి చేయూతనందిస్తూ రూ.14 లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక వంటగది, విశాలమైన భోజనశాలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శుక్రవారం ప్రారంభించారు. వేదమంత్రాల నడుమ ప్రారంభోత్సవం నిర్వహించగా, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, తాము చదువుకున్న పాఠశాలకు తిరిగి సేవ చేయాలనే భావన సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ప్రభుత్వంతో పాటు పూర్వ విద్యార్థులు కూడా విద్యాసంస్థల అభివృద్ధిలో భాగస్వాములు కావడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని అన్నారు. నేటి విద్యార్థులు కూడా ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత తమ పాఠశాలలను మరవకుండా అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పాఠశాల ప్రతినిధులు, పూర్వ విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం అవసరమని, మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిశీలించి దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 1956--68 బ్యాచ్ పూర్వ విద్యార్థులను మంత్రి శాలువాలతో ఘనంగా సన్మానించి వారి సేవాభావాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌సీ పూర్వ విద్యార్థులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, మండల, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స విజయవంతం





**పామిడి,జూలై25.అక్షరటైమ్స్:-** మండల కేంద్రమైన పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో కడప జిల్లాలోని రైల్వే కొండాపురం మండలం పరిధిలోని మురుగన్‌పల్లి గ్రామానికి చెందిన సుదీప గత కొన్ని నెలలుగా 9.6 సెంటీమీటర్ల పరిమాణంలో ఉన్న ఒవేరియన్ గడ్డతో తీవ్రమైన బాధతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యకు సంబంధించి అనేక ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ఆశించిన ఫలితం లభించలేదు ఈనేపథ్యంలో పామిడి ప్రభుత్వ ఆసుపత్రి (సీహెచ్‌సీ)లో డా. ఆర్. కమలాధర్ ( సిఏఎస్ జిఎస్), డా. వై.ఎస్. రాఘవేంద్ర రెడ్డి ( సిఏఎస్ ఏఎన్), మరియు వైద్యాధికారి డా జి.మహేష్ కుమార్, హెడ్ నర్స్ జె.శివకుమారి, నాగరత్నమ్మలతో కూడిన వైద్య బృందం అత్యంత నైపుణ్యంతో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది, ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఈ సందర్భంగా రోగి భర్తతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రధాన సభ్యులు చిలకల రాజగోపాల్ మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులలో నయం కానీ వ్యాధులను కూడా పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు నయం చేశారని, ఇలాంటి శాస్త్రచికిత్సలు ఎన్నో విజయవంతం చేకూర్చాలని ఇలాంటి వైద్యులు, వైద్యాధికారులు పామిడి ఆస్పత్రుల్లో విధులు నిర్వహించడం మన మండలం అదృష్టముగా భావించాలన్నారు. కావున అనవసరంగా చిన్న పెద్ద వ్యాధులకు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు ఖర్చు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అలాంటి వ్యాధిగ్రస్తులు మన వైద్యులతో సంప్రదించవలెనని ఆయన కోరారు. గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మరియు ఆయన తనయుడు పామిడి గుత్తి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ సహాయ సహకారంతో ఆసుపత్రి అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, కోరిన వైద్య నిపుణులను కల్పిస్తున్నారని వారికి వైద్యాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అత్యాధునిక వైద్య సేవలు, క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పామిడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర వైద్య సిబ్బంది సమిష్టి కృషితో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందిస్తున్నామని పేర్కొన్నారు.రోగికి విజయవంతంగా చికిత్స అందించిన వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని స్థానిక ప్రజలు అభినందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## మాదకద్రవ్యాల నివారణపై పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం,జులై25.అక్షరటైమ్స్:-** అనంతపురం జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలు మరియు ఎన్సిఓఆర్డీ నార్కో కోఆర్డినేషన్ సెంటర్, జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఎస్పీ పి.జగదీష్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యాసంస్థల్లో వారానికొకసారి అవగాహన కార్యక్రమాలు డిఈఓ, ఆర్ఐఓ, ఆర్జెడిలు పాఠశాలలు మరియు కళాశాలల్లో డ్రగ్స్, గంజాయి దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమాలు అన్ని విద్యాసంస్థలు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, చర్చించిన అంశాలు మరియు ఇతర వివరాలను తప్పనిసరిగా గూగుల్ ఫారంలో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

**ప్రైవేట్ పాఠశాలల ఈగల్ క్లబ్ వివరాలు**

జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన ఈగల్ క్లబ్ వివరాల ఫిజికల్ కాపీలను డీసీఆర్‌బీకి పంపించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని ఆదేశించారు.

**హాట్‌స్పాట్ ప్రాంతాల పరిశుభ్రత**

కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న చెరువుకట్ట దిగువనున్న పార్కును పూర్తిగా శుభ్రపరచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పార్కు పరిసరాల్లో ఉన్న నిరుపయోగ ప్రదేశాలు మరియు హాట్‌స్పాట్ ప్రాంతాలను గుర్తించి వెంటనే క్లియర్ చేయాలన్నారు.'పల్లెబాటలో ఈగల్' కార్యక్రమం వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, పోలీసు శాఖ మరియు ఈగల్ సెల్ సమన్వయంతో జిల్లాలోని గుర్తించిన గ్రామాలు, అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో గంజాయి సాగు నివారణ మరియు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జీఎస్టీ/కమర్షియల్ ట్యాక్స్ శాఖ అధికారులు తమ విధుల నిర్వహణలో గంజాయి లేదా మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం లభిస్తే తప్పనిసరిగా పోలీసు శాఖకు తెలియజేయాలన్నారు. విద్యాసంస్థల 500 మీటర్ల పరిధిలో నిషేధిత విక్రయాలు విద్యాసంస్థల 500 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులు, గంజాయి, మాదకద్రవ్యాలు మరియు ఇతర నిషేధిత పదార్థాల విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధించాలని సంబంధిత శాఖలకు సూచించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అన్ని శాఖలు, ముఖ్యంగా అటవీ శాఖ అధికారులు, పోలీసు శాఖ మరియు ఈగల్ సెల్‌కు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ పోలీసు శాఖ మరియు ఈగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించే డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులు, సెమినార్లు, ర్యాలీలు మరియు ఇతర కార్యక్రమాలకు పూర్తి సహకారం అందించాలని పాఠశాలలు మరియు కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడడం విద్యాసంస్థలు, పోలీసు శాఖ, ఈగల్ సెల్ మరియు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల్లో మాదకద్రవ్యాల పట్ల అవగాహన పెంచి, డ్రగ్-ఫ్రీ క్యాంపస్‌లుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఈ సమావేశంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వలి భాష, ఈగల్ నోడల్ ఆఫీసర్ జయపాల్ రెడ్డి, ఈగల్ సబ్-ఇన్‌స్పెక్టర్ బి. హనుమంతు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# రెండేళ్లలో చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రతి ఇంటికి వెళ్లి వివరిద్దాం





## పార్టీ శ్రేణులకు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపు

## ఇంటింటా ప్రచారంపై అవగాహన కల్పించిన శ్రీరామ్, అబ్జర్వర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

## ఈనెల 27వ తేదీ నుంచి అంతా ప్రజాక్షేత్రంలో ఉండాలని శ్రీరామ్ సూచన

## రూ.3.80లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్

**ధర్మవరం,జులై25.అక్షరటైమ్స్:-** ఈనెల 27వ తేదీ నుంచి జరగనున్న ఇంటింటా ప్రచారం కార్యక్రమంలో కార్యకర్త దగ్గర నుంచి ప్రతి నాయకుడు హాజరు కావాలని ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. ధర్మవరం, ఎర్రగుంటలోని పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. అబ్జర్వర్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి కార్యక్రమం గురించి శ్రీరామ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ ఛార్జిలు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.శ్రీరామ్ మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల అరాచకపాలనలో రాష్ట్రం ఆర్థికంగా నష్టాల్లో కూరుకుపోయినప్పటికీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారన్నారు. అదే సమయంలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు. తాజాగా తల్లికి వందనం ద్వారా 67లక్షల మందికి పైగా విద్యార్థులకు 10వేల 120కోట్ల రూపాయలు అందజేశారన్నారు. దీని వలన ప్రతి ఇంటా లబ్ధి జరిగిందన్నారు. ఇలాంటి అనేక కార్యక్రమాలు మనం చేస్తున్నా.దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడ్డామన్నారు. అందుకే రాష్ట్ర పార్టీ సూచన మేరకు ఈ నెల 27నుంచి ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కింది స్థాయి కార్యకర్త దగ్గర నుంచి ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రతి గడప వద్దకు వెళ్లి మనం చేసిన కార్యక్రమాల గురించి కనీసం 5నిమిషాలు ఉండి వివరించాలని సూచించారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్**

ధర్మవరం నియోజకవర్గంలో పలు ప్రాంతాల వారికి పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. తాడిమర్రి మండలంలో నలుగురికి, ముదిగుబ్బ మండలంలో మరో ఇద్దరికి రూ.3.80లక్షల రూపాయల చెక్కులను అందజేశారు. ధర్మవరం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు ముఖ్యమంత్రి చంద్రబాబు, పరిటాల శ్రీరామ్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామ్ మాట్లాడుతూ ఈ రెండేళ్లలో ధర్మవరం నియోజకవర్గంలో 421మందికి 2 కోట్ల 70 లక్షల రూపాయలు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించినట్టు చెప్పారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. ఇంత పెద్ద ఎత్తున సాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గం తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# తల్లికి వందనంతో ప్రతి విద్యార్థి ఇంటా ఆనందం కనిపిస్తోంది

## ఇది ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం.. పరిటాల సునీత

## రామగిరి మండలం కే.జీ.కుంటలో సీసీ రోడ్డును ప్రారంభించిన సునీత

## తల్లికి వందనం లబ్ధిదారులతో ఎమ్మెల్యే సునీత భేటి

## మా ఇంట్లో నలుగురు ఉన్నా అందరికీ డబ్బు పడిందన్న లబ్ధిదారులు



**అనంతపురం, జూలై 25. అక్షరటైమ్స్:-** తల్లికి వందనం పథకం అందరికీ అందడంతో.. ప్రతి విద్యార్థి ఇంటా ఆనందం కనిపిస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం కే.జీ.కుంట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు టీడీపీ నాయకులు, గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. గ్రామ సమీపంలోని కే.జీ.కుంట రోడ్డు నుంచి అక్కమ్మ అమ్మవార్ల దేవస్థానం వరకు 20 లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సి.సి రోడ్డును అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం వెంకటాపురం గ్రామంలో తల్లికి వందనం లబ్ధిదారులతో ఆత్మీయ భేటి నిర్వహించారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళ్తున్నారు.. వారికి తల్లికి వందనం పథకం అందిందా అని ఆరా తీశారు. వెంకటాపురం గ్రామానికి చెంది లక్ష్మి, సాలక్క అనే మహిళలు తమకు నలుగురు పిల్లలు చొప్పున ఉన్నారని.. వారికి ఒక్కొక్కరికి 13వేల చొప్పున 52వేల రూపాయలు అందిందన్నారు. అలాగే ముగ్గురు, ఇద్దరు పిల్లలు ఉన్న వారు సైతం తమకు 26వేలు, 39వేలు అందిందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఓ వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం రెండూ కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికే రాప్తాడు నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో రికార్డు స్థాయిలో రోడ్ల నిర్మాణాలు జరిగాయన్నారు. ఇక సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం ఈ రోజు ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా.. అందరికీ అందిందని విద్యార్థుల తల్లిదండ్రులు దీనిపై ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ మంచిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటున్న ప్రభుత్వం ఇది అని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# విద్యార్థి ఉద్యమం ముందు ప్రభుత్వాలు తలవంచక తప్పదు

## పిఎస్యు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర



**ధర్మవరం,జులై25.అక్షరటైమ్స్:-** విద్యార్థి ఉద్యమం ముందు ప్రభుత్వాలు తలవంచక తప్పదు అని, ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి రాజీనామా పోరాట విజయమేనని పి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వారూ పట్టణంలోని ఎస్సీ హాస్టల్ నందు విద్యార్థులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో పి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర మాట్లాడుతూ గత కొద్ది నెలల నుండి ఢిల్లీ నుంచి గల్లీ వరకు విద్యార్థులు,యువజనులు, ప్రజాస్వామ్య శక్తులు సాగించిన పోరాటాల ధాటికి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి రావడం విద్యార్థి ఉద్యమ విజయానికి నిదర్శనం అన్నారు. అధికార అహంకారం ఎంత పెద్దదైనా, విద్యార్థి ఉద్యమాల జ్వాల ముందు తలవంచక తప్పదు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఇదే గతి పడుతుందని తెలిపారు నీట్ పేపర్ లీకేజీ వంటి ఘటనలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశాయి అని, విద్యను కార్పొరేట్ లాభాల కోసం తాకట్టు పెట్టే విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే వరకు,విద్యారంగ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేంతవరకు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉధృతమైన ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు

# గుంతకల్ లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ పత్తి హిమబిందు



**గుంతకల్, జూలై 25. అక్షరటైమ్స్ :- (ప్రతినిధి గుమ్మనూరు హరి) :** గుంతకల్‌కు విచ్చేసిన రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పత్తి హిమబిందు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ ఆయన తో కలిసి అల్పాహారం స్వీకరించిన డాక్టర్ పత్తి హిమబిందు, గుంతకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన నర్సింగ్ స్టాఫ్ కావాలని కోరినారు అలాగే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నియమించాలని కోరారు అలాగే తక్షణమే నియమించాలని మంత్రిని కోరారు దీనిపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తక్షణమే స్పందించి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రజలు బాగుంటే మన అందరం బాగుంటాం అని చెప్పి డాక్టర్ పత్తి హిమబిందుకు మంత్రి సత్య కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు.

## రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ అసిస్టెంట్ కమిషనర్ తీవ్రంగా ఖండించిన ఆమ్ ఆద్మీ పార్టీ



**రాయదుర్గం,జూలై25.అక్షరటైమ్స్:-** మరో 5 రోజుల్లో పదవీ విరమణ అనగా లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోయిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ పైనం ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్ర ఖండన! అనంతపురం జిల్లా దేవాదాయ శాఖలో మరో ఐదురోజుల్లో (ఈ నెల 31న) ఉద్యోగ విరమణ పొందనున్న అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధుల విడుదలకు రూ. 25,000 లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం ప్రభుత్వ వ్యవస్థల్లో వేళ్లూనుకుపోయిన అవినీతికి పరాకాష్ట. ఆమ్ ఆద్మీ పార్టీ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తోంది అని ఆప్ జిల్లా కన్వీనర్ డా"బి.వెంకట రమణ అన్నారు.పుట్లూరు మండలం రామలింగేపల్లి గ్రామంలో ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన నిధులను విడుదల చేయడానికి ఒక దేవాదాయ శాఖ అధికారే నేరుగా లంచం డిమాండ్ చేయడం దేవుడి పేరుతో సాగుతున్న అవినీతికి నిదర్శనం. సర్వీస్ కాలం ముగిసిపోతున్న చివరి రోజుల్లో కూడా ప్రజాధనాన్ని, దేవుని నిధులను ఆశించి ఇలాంటి అక్రమాలకు పాల్పడటం సిగ్గుచేటు. అవినీతి రహిత పాలన అందిస్తామని చెప్పే పాలకులు ఇలాంటి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి..కేవలం సస్పెన్షన్లు, నామమాత్రపు విచారణలతో సరిపెట్టకుండా, ఇలాంటి అవినీతి అధికారుల ఆస్తులన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, చట్టపరంగా కఠినమైన శిక్షలు పడేలా చూడాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తోంది. రాష్ట్రంలో అవినీతిపై ఏసీబీ అధికారులు మరింత నిఘా పెంచి, ప్రక్షాళన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## క్రీడాకారులు ఐకమత్యంతో తమ ప్రతిభను చాటాలి ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు





**రాయదుర్గం,జూలై25.అక్షరటైమ్స్:-** క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి అని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని అన్నారు .గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన అమరావతి ఛాంపియన్షిప్ (2026) క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూక్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. క్రీడాకారులు కుల, మత, వర్గ, ప్రాంత భేదాలకు అతీతంగా ఐకమత్యంతో తమ ప్రతిభను ప్రదర్శించాలని సూచించారు. గెలిచిన వారిని అభినందించడంతో పాటు ఓడిన క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. ఈ ఏడాది ఓడిపోయిన వారు వచ్చే ఏడాది మరింత పట్టుదలతో కృషి చేసి విజయం సాధించవచ్చని సూచించారు. రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన ఏ క్రీడాకారుడు విజయం సాధించినా అది మొత్తం నియోజకవర్గానికే గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం, మానసిక ఉల్లాసం ఉంటే జీవితంలో మరిన్ని విజయాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం వల్లే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వంటి నాయకులు అవిశ్రాంతంగా ప్రజా సేవలో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ అధ్యాపకులు, క్రీడాకారులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈగిల్ బృందంతో కలిసి ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్సై ప్రసాద్







**శింగనమల,జూలై25.అక్షరటైమ్స్:-** శింగనమల మండలం బండమీద పల్లి గ్రామంలో ఈగి ల్ బృందంతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు (డ్రగ్స్), గంజాయి వల్ల కలిగే దుష్పరిణామాలు, మహిళలపై జరిగే నేరాలు, ప్రజా భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు.అదేవిధంగా మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, డ్రగ్స్ లేదా గంజాయికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## గుంతకల్ పట్టణంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ను కలిసిన సిపిఐ నాయకులు



**గుంతకల్,జూలై25.అక్షరటైమ్స్:-(ప్రతినిధి గుమ్మనూరు హరి) :** గుంతకల్ పట్టణం నందు గల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ను కలిసిన సిపిఐ నాయకులు ఆయనకు సిపిఎం నాయకులు వినుపత్రం అందజేసి మాట్లాడారు అలాగే సిపిఎం నాయకులు మంత్రి తో మాట్లాడుతూ 200 పడకల స్థాయికి పెరిగిన మన హాస్పిటల్ లో పేషెంట్లకు చాలా ఇబ్బందికరమైనటువంటి సమస్యలు ఉన్నాయి. వాటిని సిపిఐ పట్టణ పార్టీ తరపున మీకు విన్నవించుకుంటున్నాము.కావున మీ పరిధిలో ఉన్నటువంటి ఈ సమస్యలను వెంటనే పరిష్కరిస్తారని సిపిఐ పట్టణ పార్టీగా కోరుకుంటున్నాశీ. సమస్యలు 1.క్యాజువాలిటీ వార్డును హాస్పిటల్ ముందు బాగాన ఏర్పాటు చేయాలి. మరియు ఓపి ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పేషెంట్లకు అనుకూలంగా కొనసాగించాలి.2.పోస్ట్మాస్టర్ గది దగ్గర డీ ఫ్రిజ్ ను ఏర్పాటు చేయాలి.3 బెడ్లపై బెడ్షీట్లు ప్రతిరోజు మారుస్తూ ఉండాలి.4, డాక్టర్లు ఐదు రోజులు మందులు రాస్తే 3 రోజులకు మాత్రమే ఇస్తున్నారు.5 డాక్టర్లు రాసిన ప్రకారం మందులు ఇవ్వాలి. 6, రక్త పరీక్ష గది దగ్గర ఇరుకుగా ఉంది. విశాలమైన ప్రాంతానికి ఆ గదిని మార్చాలి, అక్కడ ఒక సెక్యూరిటీ గార్డును కూడా నియమించాలి.7, మన హాస్పిటల్ కు డబ్బులు లేని పేషంట్లే ఎక్కువమంది వస్తారు. అలాంటి వారి కోసం దాతలు అంబులెన్స్ ఇవ్వడం జరిగింది. అంబులెన్స్ ని వినియోగం లోకి తీసుకురావాలని తెలియజేస్తున్నాం.8, ఆధార్ కార్డు విధానాన్ని తీసివేయాలి మరియు ఖాళీగా ఉన్న నర్సు పోస్టులు భర్తీ చేయాలి. 9, ఓపికౌంటర్ దగ్గర మరియు మందులు పంపిణీ చేసే దగ్గర అధిక సంఖ్యలో జనాలు గుమ్మి గుడి ఉండటం జరుగుతుంది. కావున పేషెంట్లు కు సరిపడు కౌంటర్లు కూడా ఏర్పాటు చేయాల్సిందిగా కోరుచున్నాము.అలాగే మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందిస్తూ మాట్లాడుతూ పై అధికారులతో మాట్లాడి మీరు చెప్పిన హామీలు నెరవేరుస్తానని మాట ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ సహాయ కార్యదర్శి మురళి కృష్ణ ఏఐ టు యు సి మండల కార్యదర్శి దాసరి శీను ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య సిపిఐ నాయకులు బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

## పంట భీమా నమోదుకు ఆర్బికే సచివాలయాలకు అనుమతులు ఇవ్వాలి




**రాయదుర్గం,జూలై25.అక్షర టైమ్స్:-** పంటలు బీమా నమోదుకు 2, నెలల సమయం పెంచాలిపంటల బీమా ప్రీమియం నమోదులో తీవ్ర ఇబ్బందులు - గ్రామ ఆర్బికే, సచివాలయాలకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ - ఆగస్టు 17 కలెక్టరేట్ ముట్టడిలో రైతులతో కలిసి పోరాడతాం రాయదుర్గం పట్టణంలో రైతు సంఘం యువజన సమాఖ్య నాయకులు సి.ఎస్.సి సెంటర్ల దగ్గర రైతుల ఇబ్బందులు తెలుసుకోవడం జరిగింది.కూటమి ప్రభుత్వం "పంటను రక్షించుకుందాం, చిన్న ప్రీమియంతో పెద్ద భరోసా" అంటూ ప్రకటనలు చేస్తున్నా, రాయదుర్గం మండలంలో రైతులు మాత్రం సి.ఎస్.సి కేంద్రాల చుట్టూ 4-5 రోజులు తిరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాలూకా కార్యదర్శి తిప్పేస్వామి, ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కావలి కోట్రేష్ ఆరోపించారు.రాయదుర్గం మండలంలో మొత్తం 24 సిఎస్సి కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 6 కేంద్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. దీంతో రైతులు పట్టణాలకు తరలివెళ్లి సర్వర్ సమస్య, 1బి సమస్యలతో బీమా నమోదు చేసుకోలేకపోతున్నారు.రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు 1. సర్వర్ ం 1బి సమస్య: మీసేవ కేంద్రాల్లో సర్వర్ పనిచేయక, 1దీ పత్రం లేకపోవడంతో 4-5 రోజులు తిరిగినా నమోదు కావడం లేదు 2.సి.ఎస్.సి సెంటర్ల కేంద్రాల కొరత: 24లో 6 మాత్రమే పనిచేస్తున్నాయి. కొన్ని సెంటర్లలో రైతుల దగ్గర అదనపు వసూళ్లు చేస్తున్నారు.3. సమాచారం లేకపోవడం: చాలా సిఎస్సీ సెంటర్లలో పంటల బీమా నమోదు వివరాల బోర్డులు పెట్టలేదు 4.ప్రీమియం భారం: గత ప్రభుత్వంలో ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేది. ఇప్పుడు రైతుల నుండే వసూలు చేస్తున్నారు 5.ఎకరా బదులు హెక్టారుకు ధర నిర్ణయించడం వల్ల రైతులకు అదనపు భారం తగ్గుతుంది.6.ఎల్నినో దెబ్బకు వర్షాలు లేక పంటలు పెట్టుకున్న రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.7.ఇప్పటికే ఫర్టిలైజర్ ఎరువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. రైతుకు మేలు చేసే ప్రభుత్వమని చెప్పే నాయకులేమో వీటిపై ప్రశ్నించకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండడం బాధాకరం విచారకరం.నాయకులు మాట్లాడుతూ "వర్షాలు లేక బోర్లు ఎండిపోయి, ఎరువుల ధరలు పెరిగి రైతు ఇప్పటికే నష్టపోతున్నాడు. ఇలాంటి సమయంలో ప్రభుత్వం భరోసా ఇవ్వాల్సింది పోయి సి.ఎస్.సి సెంటర్ల చుట్టూ తిప్పుతోంది. గ్రామంలోనే 10-15 మంది స్టాఫ్ తో సచివాలయాలు, ఆర్.బి.కె లు నడుస్తున్నప్పుడు, పంటల బీమా సేవలు అక్కడ ఎందుకు అందుబాటులో ఉంచడం లేదు" అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కుమార్ ,కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పామిడిలో పెనుగొండ డిడిఓ తేజోష్ణకు ఘన సన్మానం

### జిల్లాలో అట్టడుగు స్థానంలో ఉన్న మండలాన్ని ప్రథమ స్థానంలో నిలిపిన ఘణశీలి

### వీడ్కోలు సభలో సిబ్బంది కన్నీటి పర్వం





**పామిడి,జూలై25.అక్షరటైమ్స్:-** పామిడి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పదోన్నతి పొంది పెనుగొండ డిడిఓగా బదిలీ అయిన తేజష్ణకు మండలంలోని అన్ని శాఖల అధికారులు శనివారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సన్మాన ఆత్మీయసమావేశంలో తహసిల్దార్ షర్మిల మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలలో మన తన బేదం లేకుండా అన్ని శాఖలు తనదిగా భావించి విజయవంతం చేసేదని, నాకెంతో తోడ్పాటుగా సహకరించేదని, ఆమె బదిలీపై సంతోషించాలో బాధపడాలో దిక్కు తెలియలేదన్నారు. అలాగే ఏపీవో ఆదినారాయణమ్మ మాట్లాడుతూ మేడం యంపిడిఓగా ఉన్నంతకాలం నాకు కొండంత ధైర్యం బలం ఉండేది అన్నారు. గతంలో ఇద్దరం బుక్కరాయసముద్రంలో విధులు నిర్వహించామని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవోలు అశ్వర్తనాయుడు, రంగనాయకులు,ఎ.ఓ.హరినాథ్ మాట్లాడుతూ ప్రగతిపట్ల పామిడిమండలం జిల్లాలో అత్యంత అడుగు స్థానంలో ఉన్న మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత మేడంకే దక్కుతుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు ఇంజనీర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి మాపై ఫిర్యాదులు ఎన్ని వచ్చినా వాటిపై తప్పు ఒప్పులను సరిదిద్దుతూ మాకు ఎంతో ధైర్యం కల్పిస్తూ మా ప్రవర్తన శైలిలో మార్పులు తెస్తూ ధైర్యం కల్పించేదని, మండల వ్యాప్తంగా తాగునీరు, డ్రైనేజీలు, శుభ్రత పరిశుభ్రత, రోడ్లు, తడి పొడి చెత్త కేంద్రాలు తదితర అంశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించేదని,ఇటువంటి అధికారిని మండలానికి దూరం కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తపరిచారు. అలాగే రాజకీయాలకు అతీతంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం అభివృద్ధి పట్ల ఏది అడిగినను కాదనక మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఏకార్యక్రమాన్నైనా విజయవంతం చేకూర్చిందని, తన విధులకు గంట ముందే హాజరయ్యేదని ఇలాంటి అధికారి గతంలో కానీ,ఇప్పుడు గాని, ఎప్పటికీ రాలేదని, పదోన్నతిపై బదిలీ కాదన లేకుండా ఉన్నామని, మామూలు బదిలీ అయ్యింటే ఆందోళన కార్యక్రమాలు మిన్నంటేవని తమ తమ మనోభావాలను వ్యక్తపరిచారు. మరియొక పదోన్నతిపై అనంతపురంజిల్లా అధికారిగా రావాలని ఆకాంక్షను వ్యక్తపరిచారు.ప్రతి ఒక్కరిని చిరునవ్వులతో పలకరిస్తూ సమస్యలు, వచ్చిన పనులను అడిగి తెలుసుకుని వేగవంతముగా పరిష్కరించేదని కొనియాడారు. పాల్గొన్న ప్రతి అధికారులు, నాయకులు వ్యక్తిగతంగా ఆమెకు శాలువా గప్పి కానుకలు సమర్పించారు. పాల్గొన్న అందరికీ నమస్కరిస్తూ సొంత వాహనములో ఎక్కుతుండగా క్రింద స్థాయి సిబ్బంది కన్నీటి పర్వం చెందారు.

## కలంతో జీవనం జీవో 396తో కలవరం.!

### మా కడుపు కొట్టొద్దు బాబు" అంటూ మోకాళ్లపై కూర్చొని ఆందోళన



**ఉరవకొండ,జూలై25.అక్షరటైమ్స్:-** రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉరవకొండ పట్టణంలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట డాక్యుమెంట్ రైటర్లు శనివారం వినూత్నంగా నిరసన చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి, "మా కడుపు కొట్టొద్దు బాబు", "జీవో 396 రద్దు చేయాలి" అంటూ నినాదాలు చేస్తూ మోకాళ్లపై కూర్చొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా ప్రజలకు డాక్యుమెంట్ల తయారీ, రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్న తమ వృత్తిపై జీవో 396 తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ విధానంతో డాక్యుమెంట్ తయారీ ప్రక్రియలో మార్పులు రావడం వల్ల వేలాది మంది డాక్యుమెంట్ రైటర్ల ఉపాధి ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు సేవల పేరుతో కొత్త విధానాలను తీసుకురావడం సమంజసమే అయినప్పటికీ, వాటి వల్ల సంప్రదాయ వృత్తులపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడకూడదన్నారు.

**జీవో 396 ఏమిటి?**

డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత పారదర్శకంగా, డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ప్రభుత్వం జీవో 396ను జారీ చేసింది. ఇందులో పత్రాల తయారీ, ఆన్‌లైన్ సేవలు, డిజిటల్ డాక్యుమెంట్ ప్రాసెసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వడంతో సంప్రదాయ డాక్యుమెంట్ రైటర్ల పాత్ర గణనీయంగా తగ్గుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తమ ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, వేలాది కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని పేర్కొంటున్నారు. జీవో 396ను వెంటనే ఉపసంహరించుకోవాలని, డాక్యుమెంట్ రైటర్లతో ప్రభుత్వం చర్చలు జరిపి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ప్రాంతానికి చెందిన డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

## ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి: ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు





**రాయదుర్గం,జూలై25.అక్షరటైమ్స్:-** కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి అని కార్యకర్తలకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపు ఇచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి అర్థమయ్యేలా తెలియజేయాల్సిన బాధ్యత మనదేనని టీడీపీ శ్రేణులకు రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాయదుర్గంలోని మద్దానేశ్వర స్వామి కళ్యాణ మండపంలో శనివారం నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, సామాజిక భద్రతతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో ఎదురైన ఇబ్బందులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. ఈనెల 27 నుండి ప్రారంభం కానున్న "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో భాగంగా టీడీపీ కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు కూటమి ప్రభుత్వం ద్వారా జరుగుతున్న మంచిని వివరించాలని సూచించారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ లో భాగంగా రైతు భరోసా, సామాజిక పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పంపిణీ, స్త్రీశక్తి పథకం తదితర కార్యక్రమాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించాలన్నారు. ఈ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న వాస్తవ ప్రయోజనాలను వివరించేలా కార్యకర్తలు పని చేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల సమాచారం చేరేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. సంక్షేమంతో సమానంగా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్ళుతున్న ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ రాయదుర్గం నియోజకవర్గం నిధులు సమకూరుస్తున్నారని తెలియజేశారు. వాటి వల్ల రాయదుర్గం నియోజకవర్గం లో జరుగుతున్న అభివృద్ధిని వివరించాలన్నారు. మనం చేసిన మంచిని చెప్పుకోలేకపోతే ఆ లోపం మనదే అవుతుందని గుర్తు చేశారు. ప్రత్యర్థులు ఎప్పుడు మనపై విషం చిమ్మటానికి సిద్ధంగా ఉంటారని వారి దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. ఐదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన వైకాపా ఏనాడు ప్రజల బాగోగులు రాష్ట్ర అభివృద్ధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రత్యర్థి పార్టీలపై ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై అనునిత్యం కుట్రపూరిత రాజకీయాలకే పరిమితమైందన్నారు. అక్రమ కేసులు, దౌర్జన్యాలు, ఆకృత్యాలతో ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్త పరిచారు. పాలనలో వైకాపాకు కూటమి ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి ఇంటిని కార్యకర్తలు సందర్శించి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై వివరించి, వారి అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలని చెప్పారు. కూటమి ప్రభుత్వ పాలనపై వారిలో సానుకూల వాతావరణాన్ని కల్పించాలన్నారు. ప్రజల మద్దతు, ఆశీస్సులతోనే కూటమి ప్రభుత్వం మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతుందని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయభేరి మోగించేలా ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఎన్నికలను ప్రతి కార్యకర్త తన బాధ్యతగా భావించి పనిచేసినప్పుడే విజయాన్ని సాధించగలమని పేర్కొన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి లభిస్తున్న మద్దతును మరింత బలోపేతం చేసేలా 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త సమష్టి కృషితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఘన విజయం సాధించేలా కష్టపడి పని చేయాలని ఎమ్మెల్యే కాలవ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, నియోజకవర్గ పరిశీలకులు గుర్రప్ప, మండల పార్టీ అధ్యక్షులు కురుబ హనుమంతు, వన్నారెడ్డి, కురుబ మల్లెన్న, కాదలూరు మోహన్ రెడ్డి, కాలువ సన్నన్న,మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత రెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు నాగల్లీ రాజు, పోరాళ్ల పురుషోత్తం,ఉప్పర ఆనంద్, మాజీ డైరెక్టర్ టశీకశాల హనుమంతు, కాటా వెంకటేశులు, నరేంద్ర, గిరిమల్లప్ప,క్లస్టర్ ఇంఛార్జీలు ఆనంద్, తలారి గంగాధర్,సిద్ధప్ప, ఇనాయత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను మర్యాదపూర్వకంగా కలిసిన డాక్టర్ పత్తి హిమబిందు



**గుంతకల్,జూలై25.అక్షరటైమ్స్:-(ప్రతినిధి గుమ్మనూరు హరి) :** గుంతకల్ కు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పత్తి హిమబిందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ పత్తి హిమబిందు, మంత్రి నిమ్మల రామానాయుడు కు ఆయనకు బొకే అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు ఇంచార్జ్ దబ్బర నారాయణ మరియు వాల్మీకి కదిరప్ప టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లోకి కలిసికట్టుగా వెళ్లాలని చెప్పిన గుంతకల్లు టిడిపి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి



**గుంతకల్,జూలై25.అక్షరటైమ్స్:-(ప్రతినిధి గుమ్మనూరు హరి) :** గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం క్యాంపు కార్యాలయంలో గుంతకల్లు మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి పట్టణ టీడీపీ నాయకులు, వార్డు ఇన్‌చార్జులు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జులు, కార్యకర్తలతో ముఖ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న ఎమ్మెల్యే డోర్ టు-డోర్ కార్యక్రమంలో ప్రతి ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్త తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ ఐకమత్యంతో పనిచేయాలని సూచించారు. ప్రతి వార్డులో వార్డు ఇన్‌చార్జులు, నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జులు సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని అన్నారు. మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డోర్-టు-డోర్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో తీసుకున్నారని, ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడానికి ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. వార్డు కౌన్సిలర్ టికెట్ ఆశిస్తున్న నాయకులు ఎంతమంది ఉన్నా, ప్రజల్లో మంచి పేరు సంపాదించి, పార్టీ కోసం కష్టపడి నిస్వార్థంగా పనిచేసిన వారికే తొలి ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. టికెట్ ఎవరికి వచ్చినా, తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి న్యాయం జరిగేలా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కట్టుబడి ఉన్నారని, వారి సేవలకు తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే డోర్-టు-డోర్ కార్యక్రమానికి వార్డుల వారీగా కార్యాచరణ రూపొందించి, ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలుస్తారని చెప్పారు. ప్రతి నాయకుడు, కౌన్సిలర్ ఆశావహుడు ప్రజలను ఆప్యాయంగా పలకరించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీకి మరింత బలం చేకూర్చాలని గుంతకల్ ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మునూరు వెంకటేష్, మరియు టిడిపి మాజీ కౌన్సిలర్లు వార్డ్ ఇన్చార్జులు కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఫ్రీ హోల్డ్ భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**సక్రమమైన భూములను క్రయవిక్రయాలకు అనుమతించాలి**

**సీపీఐ మండల కార్యదర్శి చల్ల శ్రీనివాసులు**

**రైతుల భూ హక్కులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి**

**తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన సీపీఐ మండల నాయకులు**





**ముదిగుబ్బ,జూలై25.అక్షరటైమ్స్:-** ముదిగుబ్బ మండలంలో నెలకొన్న ఫ్రీ హోల్డ్ భూముల సమస్యలను తక్షణమే పరిష్కరించి, సక్రమంగా ఉన్న భూములను అధికారికంగా ఫ్రీ హోల్డ్ చేయడంతో పాటు రైతులు తమ భూములను చట్టబద్ధంగా క్రయవిక్రయాలు చేసుకునే అవకాశం కల్పించాలని సీపీఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. అలాగే ఫ్రీ హోల్డ్ భూములపై పంట రుణాల రెన్యువల్ చేసుకోవడంతో పాటు పంటల బీమాకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతూ శనివారం ముదిగుబ్బ తహసీల్దార్ మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ.. విస్తీర్ణంలో రాష్ట్రంలోనే పెద్ద మండలాల్లో ఒకటిగా పేరుగాంచిన ముదిగుబ్బ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఫ్రీ హోల్డ్ భూములు ఉన్నాయని తెలిపారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 20 ఏళ్ల సీనియార్టీ కలిగిన అసైన్డ్ భూములకు చట్టబద్ధత కల్పించి, వాటిని రిజిస్ట్రేషన్ భూములుగా మార్చే ప్రక్రియలో భాగంగా ఫ్రీ హోల్డ్ విధానాన్ని ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ఈ విధానంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 13.59 లక్షల ఎకరాల భూములను ఫ్రీ హోల్డ్ చేసినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసిందని ఆయన అన్నారు. అయితే రెండేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఫ్రీ హోల్డ్ భూముల వ్యవహారంలో భారీగా అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై విచారణ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. దాదాపు 5 లక్షల ఎకరాలకు పైగా భూముల్లో అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం పలుమార్లు ప్రకటించిందని గుర్తు చేశారు. అక్రమాలు జరిగినట్లు గుర్తించిన భూములను పక్కనపెట్టి, ఎటువంటి అవకతవకలు లేని సక్రమమైన భూములను అధికారికంగా ఫ్రీ హోల్డ్ చేయడానికి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీపీఐ నాయకులు ప్రశ్నించారు. విచారణ పేరుతో సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ సక్రమంగా ఉన్న భూముల రికార్డులను సైతం లాక్‌లో ఉంచడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఫ్రీ హోల్డ్ భూములపై స్పష్టత లేకపోవడంతో రైతులు తమ భూములను చట్టబద్ధంగా క్రయవిక్రయాలు చేసుకోలేకపోతున్నారని, పంట రుణాలను రెన్యువల్ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పంటల బీమా వంటి ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అనేక మంది రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కనుక ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి రాష్ట్రవ్యాప్తంగా దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఫ్రీ హోల్డ్ భూముల సమస్యను తక్షణమే పరిష్కరించాలని చల్లా శ్రీనివాసులు కోరారు. అక్రమాలు జరిగిన భూములపై విచారణ కొనసాగిస్తూనే, సక్రమంగా ఉన్న భూముల రికార్డులను పరిశీలించి వాటిని వెంటనే ఫ్రీ హోల్డ్ చేసి రైతులకు పూర్తి హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే సంబంధిత రైతులను కలుపుకుని త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి ఈశ్వర్ నాయక్‌తో పాటు స్థానిక నాయకులు శంకర్, ఏ. రామంజి, ప్రసాద్ నాయక్, భాస్కర్ నాయక్, గణేష్, చాంప్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా బి హెచ్ రాయుడు

**మడకశిరకు రాష్ట్ర స్థాయి పదవి**



**మడకశిర,జూలై25.అక్షరటైమ్స్:-** వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా మడకశిర నియోజకవర్గానికి చెందిన తిమ్మలాపురం బి హెచ్ రాయుడిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. ఈ నియామకంతో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.బి హెచ్ రాయుడు 2014 నుంచి వైఎస్సార్సీపీ కోసం క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనను ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దింపాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించినప్పటికీ, కొన్ని పరిస్థితుల నేపథ్యంలో చివరకు డాక్టర్ తిప్పేస్వామికి అవకాశం లభించింది.దాదాపు మూడు దశాబ్దాలుగా మడకశిర నియోజకవర్గంలో పత్రికా విలేకరిగా, దళిత నాయకుడిగా సేవలందిస్తున్న బి హెచ్ రాయుడు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేశారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్ కోసం ప్రయత్నించినప్పటికీ అవకాశం ఈరలక్కప్పకు దక్కింది.రాష్ట్ర స్థాయి పదవి లభించడంతో నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా దళితులు, విద్యావంతులు, సామాజిక సేవకులు బి హెచ్ రాయుడికి అభినందనలు తెలియజేస్తున్నారు.ఈ సందర్భంగా బి హెచ్ రాయుడు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శి పదవి అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాల సాధనకు, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. తనకు సహకరించిన ఎంపీ మిథున్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పార్లమెంటు పరిశీలకుడు రమేష్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బి. శివకుమార్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# విద్యతో పాటు క్రీడల్లోనూ బ్లూమూన్ విద్యార్థుల సత్తా

**అమరావతి ఛాంపియన్స్ కప్-2026లో సత్తా చాటిన విద్యార్థులు**

**కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్, చెస్, యోగాతో సహా పలు క్రీడాంశాల్లో ప్రతిభ**




**కదిరి,జూలై25.అక్షరటైమ్స్:-** అమరావతి ఛాంపియన్స్ కప్--2026లో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో బ్లూమూన్ విద్యాసంస్థల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తూ మొత్తం 20 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంస్థకు మరో ప్రతిష్ఠను తీసుకొచ్చిందని బ్లూమూన్ విద్యాసంస్థల అధినేత ఎం. శివశంకర్ తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించేలా ప్రత్యేక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఫలితమే ఈ విజయమని ఆయన పేర్కొన్నారు. జిల్లా స్థాయిలోనూ ఇదే జోరును కొనసాగించి మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.. అండర్-17 విభాగంలో కబడ్డీలో అభినాష్, లియాకత్, రోషన్, వాలీబాల్‌లో సంజయ్ కుమార్, యోగాలో గజవర్ధన్ నాయక్, చెస్‌లో తేజేశ్వర్ రెడ్డి, ఖోఖోలో లిఖిత్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-23 విభాగంలో వాలీబాల్‌లో నాగేంద్ర, జావీద్, షాదాబ్, కబడ్డీలో విష్ణువర్ధన్, శ్రీకాంత్, రాజేష్ కుమార్, షాదాబ్, బ్యాడ్మింటన్‌లో హుసేన్, మౌనీస్,100 మీటర్ల పరుగుపందెంలో నవీన్, షాట్‌పుట్‌లో షాహిద్, బాక్సింగ్‌లో మనోజ్ కుమార్ జిల్లా స్థాయి అమరావతి ఛాంపియన్స్ పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు జి. రామాంజుల రెడ్డి తెలిపారు. విద్యార్థుల విజయాలను పురస్కరించుకుని నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి. సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఈ ఘనత సాధించారని కొనియాడారు. జిల్లా స్థాయిలోనూ బ్లూమూన్ విద్యాసంస్థల ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సి. మాధవరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. మనోహర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు జి. రామాంజుల రెడ్డి, విజయ్, కుమార్, డ్యానియల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులను ఘనంగా అభినందించారు.

# నా తండ్రి జ్ఞాపకాన్ని ఆయన ఇచ్చిన ప్రోత్సాహాన్ని మరువలేను

**ధర్మవరపు కొండన్న వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత**

**6వ వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద కుటుంబసభ్యులతో కలిసి నివాళి**



**అనంతపురం, జూలై 25. అక్షర టైమ్స్:-** కష్ట సమయంలో నా తండ్రి ఇచ్చిన ధైర్యాన్ని, ప్రోత్సహాన్ని అలాగే ఆయన జ్ఞాపకాలను ఎప్పటికీ మరువలేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఆమె తండ్రి ధర్మవరపు కొండన్న 6వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం రామగిరి మండలం వెంకటాపురంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సునీత తన కుటుంబసభ్యులతో కలిసి ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి.. నివాళు లర్పించారు. అనంతరం తండ్రి ఘాట్ వద్ద కాసేపు మౌనంగా గడిపారు. అనంతరం తన సోదరులతో కలిసి అన్నదానం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ తన భర్త పరిటాల రవితో పాటు తండ్రి కొండన్న మరణాలు జీవితంలో మర్చిపోలేని సంఘటనలన్నారు. భర్త చనిపోయి దుఃఖంలో, నిర్వేదంలో ఉన్న తనకు అండగా నిలిచిన వారిలో ముందుగా తన తండ్రి ఉన్నారన్నారు. రాజకీయాల్లోకి రావాలా వద్దా అని భయపడుతున్న సమయంలో తండ్రి వెన్ను తట్టి ప్రోత్సహించారన్నారు. ఆ రోజు నుంచి మరణించే వరకు తన వెన్నంటే నడిచారన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తి, జ్ఞాపకాలతోనే ముందుకు సాగుతానని చెప్పారు.

# జూలై నెలలో30-31 తేదీలలో జరిగే కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అయూబ్ ఖాన్**




**ధర్మవరం,జులై25.అక్షరటైమ్స్:-**జూలై నెలలో30,31 వ తేదీలలో కలెక్టరేట్ల వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అయూబ్ కాన్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో తలపెట్టిన క్యాంపెయిన్ లో భాగంగా, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ప్రతి కార్మికుడికి నెలకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు, ఆటో కార్మికులకు, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే స్వీపర్లకు, విద్యుత్ రంగంలో పనిచేసే ఔట్సోర్సింగ్ కార్మికులకు, ఎమ్మార్వో కార్యాలయంలోని వీఆర్ఏ.లకు కరపత్రాలను పంపిణీ చేసి, గోడపత్రికలను విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్,వెంకటేష్, చేనేత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ జె,వి,రమణ, ట్రాన్స్పోర్ట్ రంగం పట్టణ నాయకులు ఎస్,రఫీ, మాట్లాడుతూ, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ విధానాల వల్ల కార్మికులు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు మరియు చట్టబద్ధమైన హక్కులను కోల్పోతున్నారని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడి, సమాన పనికి సమాన వేతనం కల్పించి, సామాజిక భద్రత, ఈ,ఎస్,ఐ పీ,ఎఫ్, వంటి సౌకర్యాలను కల్పించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మరియు కార్మికులు, ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు మరియు కార్మికులు, ట్రాన్స్పోర్ట్ కార్మిక రంగం నాయకులు ,కార్మికులు, ప్రభుత్వ ఆసుపత్రి స్లీపర్స్ సంఘం నాయకులు మరియు కార్మికులు, విద్యుత్ రంగం కార్మికులు, పాల్గొన్నారు.

# తొలి ఏకాదశికి వైష్ణవాలయాల్లో భక్తుల వెల్లువ

**పెన్నహోబిలంలో ప్రత్యేక పూజలు.. కోలాటాలతో ఆధ్యాత్మిక శోభ..**

**గోవింద నామస్మరణతో మారుమోగిన వెంకటేశ్వర ఆలయం**





**ఉరవకొండ,జూలై25.అక్షర టైమ్స్:-** ఆషాఢ మాసం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉరవకొండ మండలంలోని వైష్ణవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని విష్ణుమూర్తిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణాలన్నీ గోవింద నామస్మరణ, భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తిమయ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ పెన్నహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అర్చకులు స్వామివారి మూలవిరాట్టుకు విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకారాలు నిర్వహించి మహామంగళహారతి సమర్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి దర్శనాన్ని సజావుగా నిర్వహించారు. ఉరవకొండ పట్టణంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా తొలి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అర్చనలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని పెన్నహోబిలం దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయ కోలాట ప్రదర్శనలు నిర్వహించగా భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజు, కమిటీ సభ్యులు, కార్యనిర్వాహణాధికారి రమేష్ బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉరవకొండలో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు



**ఉరవకొండ,జులై25.అక్షర టైమ్స్:-** ఆదివాసీ సమాజ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహావీరుడు ఏకలవ్య జయంతిని ఉరవకొండలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అతిథి గృహం నుంచి టవర్ క్లాక్ వరకు గిరిజనులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏకలవ్యకు జై అంటూ నినాదాలు చేస్తూ పట్టణ ప్రధాన వీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గురుభక్తికి, అంకితభావానికి, క్రమశిక్షణకు ఏకలవ్య చిరస్థాయిగా నిలిచిన ఆదర్శమూర్తి అని పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించిన ఏకలవ్య జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమన్నారు. విద్యతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, సమాజ సేవా దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని, విద్య, ఉపాధి అవకాశాలను మరింత విస్తరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోలేగుండ్ల శేఖర్, వసంత్, వీరేంద్ర, వీరేశ్‌తో పాటు గిరిజన సంఘాల నాయకులు, యువకులు, మహిళలు, విద్యార్థులు పాల్గొని ఏకలవ్య ఆశయాలను కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు.

# దేశంలోనే ఏకైక గజేంద్రమోక్ష దేవాలయంలో ఘనంగా శయన ఏకాదశి వేడుకలు





**పామిడి,జూలై25.అక్షరటైమ్స్:-** స్థానిక పామిడిలోని శ్రీఅనంత, గజ గరుడ,లక్ష్మి నారాయణస్వామి దేవాలయంలో శనివారం శయన ఏకాదశి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రధానపురోహితులు విశ్వనాథ శర్మ అభిషేకం, పూజలు నిర్వహించారు. విష్ణుసహస్రనామ పారాయణం గావించారు. శ్రీదేవి భూదేవి సమేత స్వామి వార్లను పల్లకిలో చేసి గోవింద నామాల ను అలకిస్తూ ప్రకారోత్సవం నిర్వహించారు. మహా మంగళ హారతి గావించి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇఓ శివమూర్తి, దేవాదాయ కార్యనిర్వహణఅధికారి ఏ కృష్ణయ్య, బొల్లు శ్రీనివాసులు రెడ్డి,దేవాలయ కమిటీసభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల రహిత పై అవగాహన సదస్సు



**పెద్దవడుగూరు,జులై25.అక్షరటైమ్స్:-** మండల కేంద్రమైన పెద్దవడుగూరు కేజీబీవీ పాఠశాలలో బాల్య వివాహాలు రహిత పై అవగాహన నిర్వహించారు ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి ఎస్ఓ ఉష మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం 18 సంవత్సరం లోపు బాలికలకు 21 సంవత్సరం లోపు బాలుడికి వివాహం చేయడం చట్టరీత్య నేరం అని. అవగహన కలిపించారు. ప్రతి విద్యార్థి సురక్షితంగా మరియు గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉంటారని తెలిపారు. బాలలపై జరిగే వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు వంటి సమస్యలు చట్టపరంగా నేరాలని చెప్పారు మరియు చిన్న పిల్లలకు వివాహం చేయడం వల్ల తొందరగా గర్భ ధారణ వల్ల కలిగే అనార్ధల గురించి అవగాహన కల్పించారు.అలాగే, ఇంటర్నెట్ ఉపయోగిస్తున్నప్పుడు జాగ్రత్తలు పాటించాలని, సోషల్ మీడియా ద్వారా అపరిచితులతో మాట్లాడకూడదని విద్యార్థులకు తెలియజేశారు. ఇలాంటి అవగాహన సందేహాస్పద పరిస్థితులు ఎదురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు కాల్ చేయాలని సూచించారు